విశాలాంధ్ర
విశాఖపట్నం
శుక్రవారం 29, ఆగస్టు 2025

సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా స్టాలిన్

విశాలాంధ్ర - గాజువాక: ఒంగోలు నగరంలో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల్లో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా ఏ.జె. స్టాలిన్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. ఏ.జె.స్టాలిన్ జి.వి.ఎం.సి సీపీఐ ఫ్లోర్ లీడర్‌గా, 72వ వార్డు కార్పొరేటర్‌గా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ నేతగా ప్రజల పక్షాన నిరంతరం పోరు సాగిస్తున్నారని అన్నారు. స్టాలిన్ సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా స్టాలిన్‌ను సీపీఐ నేత ఆనంద్ శాలువాతో ఘనంగా సత్కరించారు.

శ్రీ తనుష్ పాఠశాలలో అమానుషం

- 8వ తరగతి విద్యార్థి చెయ్యి విరగొట్టిన ఉపాధ్యాయుడు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ ప్రాంతంలోని శ్రీ తనుష్ పాఠశాలలో అమానుషం చోటుచేసుకుంది. ఎనిమిదో తరగతి విద్యార్థి చెయ్యి విరగొట్టిన ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇనుప బల్లకేసి చితక బాది ఆపై పిడిగుద్దులతో గాయపరిచాడు. మూడు చోట్ల ఎముక విరగడంతో శస్త్ర చికిత్స కోసం విద్యార్థిని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు కారణమైన సోషల్ మాస్టర్ మోహన్ పరారీలో ఉన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ పిళ్లా శివ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం ఉదయం స్కూల్ వద్ద తల్లిదండ్రులు, కాలనీవాసుల ఆందోళనకు దిగారు. పి.ఎం.పాలెం పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పీఎం పాలెం పోలీసులు నిందితులపై చర్యలు తీసుకునేందుకు గాలిస్తున్నారు.

ఆటో కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - గాజువాక: తమ న్యాయమైన హక్కుల కోసం ఆటో కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏ.ఐ.టి.యూ.సి సంపూర్ణ మద్దతు ప్రకటించించింది. గురువారం ఆటో కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ లకు ఉపాధి కోల్పోయిందని విశాఖ జిల్లా ఏ.ఐ టి.యూ.సి కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ, గాజువాక కార్యదర్శి జి.ఆనంద్ అన్నారు. జరిమానాలు పెంచే జి.ఓ నెంబర్ 21, 31ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరిస్తూ, ఆటో కార్మికుల ఉపాధికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు హసన్ ఖాన్, వల్లి, గొలగాని నాయుడు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న మంత్రి నారా లోకేష్

ఘన స్వాగతం పలికిన టిడిపి నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మూడు రోజుల విశాఖ పర్యటనకు మంత్రి నారా లోకేష్ గురువారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. విశాఖ ఎయిర్ పోర్టులో మంత్రి లోకేష్‌కు పెద్దఎత్తున ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీ భరత్, హోంమంత్రి వంగలపూడి అనిత ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మేయర్ పీలా శ్రీనివాస్ స్వాగతం పలికారు. విమానాశ్రయంలో ప్రజలు, కార్యకర్తలను కలిసి అర్జీలు మంత్రి స్వీకరించారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం మంత్రి నారా లోకేష్ పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 10.00 - 11.00 వైజాగ్ కన్వెన్షన్ లో జరిగే అర్థసమృద్ధి 2025- ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. అనంతరం ఉదయం 11.30 - 12.15 విశాఖ చంద్రంపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభిస్తారు. అక్కడనుండి మధ్యాహ్నం12.30 -01.30 రాడిసన్ బ్లూ రిసార్ట్ లో ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు. సాయంత్రం 3.00 - 04.00 విశాఖ నోవాటెల్ హోటల్‌లో ఎయిరోస్పేస్ మానుఫ్యాక్చరింగ్‌పై సీఐఐ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో పాల్గొంటారు. సాయంత్రం4.00 - 05.30 ఆంధ్రయూనివర్సిటీ కన్వెన్షన్ హాల్‌లో జరిగే స్పోర్ట్స్ మీట్ లో పాల్గొంటారు. అనంతరం రాత్రి 6.00 - 07.30 విశాఖ రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో భారత మహిళా క్రికెట్ జట్టుతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. తర్వాత టిడిపి పార్టీ కార్యాలయంలో రాత్రి బస చేయనున్నారు.

భీమిలిలో మహిళ ఎస్.ఈ.జెడ్

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పీఎం పాలెం: భీమిలి నియోజకవర్గంలో ప్రత్యేక మహిళ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్.ఈ.జెడ్.) ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఈ విషయమై మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా తన అంగీకారాన్ని తెలియజేశారన్నారు. మధురవాడ వి - కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన స్త్రీ శక్తి పథకం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి మహిళలకు టీడీపీ అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఆస్తిలో సమాన వాటా హక్కు.. మహిళ రిజర్వేషన్లు.. వంటి విప్లవాత్మక సంస్కరణలతో మహిళ సంక్షేమం దిశగా పాటుపడిన టీడీపీకి తెలుగింటి ఆడపడుచులు వెన్నెముకగా అభివర్ణించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన డ్వాక్రా సంఘాల విజయం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి మహిళలపై గౌరవం లేదని.. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని విమర్శించారు. విశాఖను రాజధాని చేస్తానని ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ఎలాంటి ప్రాథమిక అనుమతుల్లేకుండా రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం తప్ప సాధించింది ఏమీ లేదన్నారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని గంటా తెలిపారు. లోకేష్ చొరవతో టీసీఎస్, అదానీ డేటా సెంటర్, కాగ్నిజెంట్, గూగుల్, సత్వా, సిఫీ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు విశాఖకు క్యూ కడుతున్నాయని వివరించారు. 2026 జూలైలో భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి వచ్చే సమయానికి 15 కనెక్టివిటీ రోడ్లు, 10 ఫ్లై ఓవర్లు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే 80 శాతం హామీలు నెరవేర్చామని వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఆనందపురం ఎంపీడీఓ జానకి, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత, టీడీపీ మహిళ నేతలు కురుమిన లీలావతి, బోయి రమాదేవి, వానపల్లి లక్ష్మి, మంగాదేవి, నందిని తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జీఎం హనుమా నాయక్, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ అన్షుమలి బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ లతో కలిసి జిల్లా అధికారులతో గురువారం ఉదయం సమావేశం నిర్వహించారు. పర్యటన షెడ్యూల్‌ను వివరిస్తూ శుక్రవారం ఉదయం 11.15 గంటలకు కోస్టల్ బ్యాటరీకి ముఖ్యమంత్రి చేరుకుంటారని, నోవాటెల్, రాడిషన్ బ్లూ రిసార్ట్‌లలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. హెలిప్యాడ్ దగ్గర ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, దుమ్ము, ధూళీ రేగకుండా వాటరింగ్ చేయాలన్నారు. వీఐపీల లిస్టును సిద్ధం చేసుకోవాలన్నారు. నోవాటెల్ హోటల్లో జరిగే ఫుడ్ మానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ లో ముఖ్యమంత్రి భాగస్వామ్యం అవుతారని, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాడిషన్ బ్లూ రిసార్ట్ వద్ద జరిగే గ్రిఫిన్ ఫౌండర్ నెట్ వర్కింగ్ కార్యక్రమానికి సంబంధించి కూడా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ, డీఆర్వో, ఆర్డీవోలతో పాటు కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, ఈపీడీసీఎల్ ఎస్.ఈ. శ్యాంబాబు, అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, ఐఅండ్‌పిఆర్ డీడీ కె.సదారావు, తహశీల్దార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెదపూడి సుబ్బలక్ష్మి చిరస్మణీయురాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదపూడి సుబ్బలక్ష్మి చిరస్మణీయురాలు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. సుబ్బలక్ష్మి ప్రథమ వర్ధంతి పెద గంట్యాడ సీతానగరంలో గురువారం జరిగింది. సీపీఐ నాయకులు సుబ్బలక్ష్మి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ నేతలు మాట్లాడుతూ పెద గంట్యాడ సీపీఐ శాఖా కార్యదర్శి పెద పూడి దుర్గారావు సతీమణి స్వర్గీయ సుబ్బలక్ష్మి కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా ప్రజా ఉద్యమాల్లో పని చేసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, కెంగువ అచ్యుతరావు, నాయకులు అప్పారి మూర్తి, టి.చంద్ర శేఖర్, సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులు నాగేశ్వర రావు, పద్మ, శివ, శశికళ, తాతారావు, హేమలత, కుమారుడు పెదపూడి ప్రసన్న కుమార్, రాణి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన బెహరా

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ ఏపీ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఉప ముఖ్యమంత్రితో స్థానికంగా ఉన్న సమస్యలు పార్టీ బలోపేతాన్ని గూర్చి ముచ్చటించారు.

చంద్రంపాలెం స్కూల్‌ను సందర్శించిన గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం చంద్రంపాలెం స్కూల్‌ను సందర్శించనున్న నేపథ్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఏర్పాట్లు పరిశీలించారు. సెయింట్ సాఫ్ట్ వేర్ కంపెనీ రూ.8 కోట్ల సి.ఎస్.ఆర్. నిధులతో భీమిలి నియోజకవర్గం పరిధిలోని 28 ప్రభుత్వ హైస్కూల్స్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్స్ ఏర్పాటు చేసింది. శుక్రవారం చంద్రంపాలెం హైస్కూల్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమంలో లోకేష్ పాల్గొంటారు. రాష్ట్రంలోనే అతిపెద్ద హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఏఐ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు గంటా శ్రీనివాసరావు సూచించారు. సెయింట్ సి.ఎస్.ఆర్. ప్రతినిధి పి.వి.ఎస్.శర్మ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: "సేనతో సేనాని" బహిరంగ సభకు విశాఖ నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌ను విశాఖ విమానాశ్రయంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కలిసి ఘన స్వాగతం పలికారు విశాఖలో ఈ బహిరంగ సభ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌ను సీపీ తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ (లా అండ్ ఆర్డర్)ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సీపీ సిబ్బందికి సూచించారు.

పాడుగుపాలెంలో 447 స్మార్ట్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు బదులుగా నూతన స్మార్ట్ కార్డులను అందజేస్తోంది. ఈ క్రమంలో పాడుగు పాలెం గ్రామంలోని డిపో నంబర్-4లో 447 స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దుకాణదారుడు ఎడ్ల పోలీసు రమణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఎంపీటీసీ బంటుబిల్లి అప్పలస్వామి చేతుల మీదుగా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో కర్రోతు సత్యనారాయణ, బంటుబిల్లి అప్పారావు, బంటుబిల్లి లక్ష్మణరావు, లండ వెంకట రమణ, చందక రమణ, బి.బాబ్జి రావు, బి.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్స్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా గతంలో చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి, ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి, ప్రజలపై పెనుభారాలు మోపిందని, దీనికి వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం జరిగిందని సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి జగన్ తెలిపారు. దీనిపై వామపక్ష పార్టీలు హైదరాబాద్ బషీరాబాద్‌లో నిర్వహించిన విద్యుత్ వ్యతిరేక ఉద్యమంపై పోలీసులు జరిపిన కాల్పుల్లో విష్ణువర్ధన్ రెడ్డి రామకృష్ణ బాలస్వామి అను ముగ్గురు కార్యకర్తలు అశువులు బాశారని గుర్తు చేసారు. ఈ మారణకాండ జరిగి నేటికీ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ అమరవీరుల సంస్మరణ.. ప్రతిజ్ఞ దినం పాటించినట్లు తెలిపారు. సిపిఎం గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో సుజాతనగర్ జంక్షన్ వద్ద విద్యుత్తు అమరవీరులకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ కమిటీ సభ్యులు బి.వెంకట్రావు, కే.అప్పలనాయుడు, ప్రభుదేవా, జగన్నాథ స్వామి లక్ష్మణరావు, మహేష్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

100 ఎంఎల్ డి డిసాలినేషన్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 100 ఎంఎల్ డి డిసాలినేషన్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో విశాఖ పరిధిలోని అప్పికొండ ప్రాంతంలో నిర్మించనున్న 100 ఎంఎల్ డి డిసాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు ప్రక్రియపై జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పల్లమరాజు, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కెవిఎన్ రవి, పర్యవేక్షక ఇంజనీర్ ఏడుకొండలు, ఇతర అధికారులు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఇజ్రాయెల్‌కు చెందిన టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల ప్రకారం ప్లాంట్ నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చు అవుతుందని, ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాలంటే ప్రస్తుతం ప్లాంట్ కొరకు మౌలిక వసతులు, సామాగ్రి నిల్వ సదుపాయాలు, అంతర్గత రహదారుల ఏర్పాటు మొదలైన వాటికోసం సుమారు 25 ఎకరాల భూమి అవసరం అవుతుందని దీనిని పబ్లిక్ - ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పి.పి.పి)కింద ఏర్పాటుకు నిర్ణయించడమైనదని, ప్రైవేట్ సంస్థలు ఆర్థిక పెట్టుబడి పెడతాయని జీవీఎంసీ భూమి కేటాయింపు, ప్రాజెక్టు అమలుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే అనుభవం ఉన్న ఐ.డి.ఇ టెక్నాలజీస్ ముంబైలో 400 ఎంఎల్‌డి తమిళ నాడులో 60 ఎం ఎల్ డి డిసాలినేషన్ ప్లాంట్లు అభివృద్ధి చేసిందని, అలాగే ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఐడిఇ టెక్నాలజీస్ లిమిటెడ్ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తుందని తెలిపారు.

తిరుపతికి ఉదయం విమానం కోసం ప్రత్యేక దృష్టి

- ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీ భరత్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తిరుపతికి ఉదయం విమాన సర్వీస్ కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో గురువారం జరిగిన రెండవ ఎయిర్‌పోర్ట్ సలహా కమిటీ (ఏ.ఏ.సి) సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ పురుషోత్తం, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు, నేవీ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ నుంచి తిరుపతి వెళ్లే భక్తులు ఉదయం విమానం లేకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తిరుమలలో ఉదయం సమయంలోనే శ్రీవారి దర్శన టిక్కెట్లు కేటాయించబడు తున్నందున, విశాఖ భక్తులు అవకాశాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం తిరుపతి విమానం తక్షణ అవసరం అని ఎంపీ స్పష్టం చేశారు. ప్రయాణికులకు అందుబాటు ధరల్లో ఆహారం అందించేందుకు ఉడాన్ యాత్రి కేఫ్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రారంభించాలన్న డిమాండ్‌ను కమిటీ ముందుంచారు. కోల్ కత్తా, భువనేశ్వర్, చెన్నై, అహ్మదాబాద్, పుణెలాంటి ఎయిర్‌పోర్టుల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ సౌకర్యాన్ని విశాఖలో కూడా తీసుకురావాలని కోరారు. వ్యాపార, పర్యాటక రవాణా పెరుగుతున్న దృష్ట్యా విశాఖ-మలేషియా, విశాఖ-కొలంబో సేవలు ప్రారంభించాలని ఎయిర్ లైన్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న వాష్ రూమ్‌లు పరిశుభ్రంగా లేవని అసంతృప్తిని వ్యక్తం చేస్తూ శుభ్రత, నిర్వహణపై అధికారులు మరింత దృష్టి పెట్టాలని సూచించారు.

బిజెపి మండల కమిటీ సమావేశం

విశాలాంధ్ర - పద్మనాభం: భారతీయ జనతా పార్టీ పద్మనాభ మండలం కార్యాలయ ఆవరణలో మండల కమిటీ సమావేశం మండల బిజెపి అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగింది. మండల బిజెపి ఇన్‌చార్జ్ రూపాకుల రవికుమార్ ప్రసంగిస్తూ ఈనెల 31వ తేదీ లోపు బూత్ స్థాయి, శక్తి కేంద్రాలు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. నాగమణి మాట్లాడుతూ మండల స్థాయి కమిటీలు మార్పులు చేర్పులను చేయాలని సూచించారు. మునిపెన్నడూ లేని విధంగా పార్టీ మరింత పటిష్టంగా బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల మాజీ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మచ్చ సోమేశ్, పాలూరి కృష్ణారావు ప్రధాన కార్యదర్శులు సిరిపురపు వెంకట్రావు, కలగర్ల పేర్రాజు, కార్యదర్శులు, మరగడ గౌరీ రెడ్డి, బర్లకనక, గెద్ద అప్పలనాయుడు, చొప్ప కృష్ణ, ఎర్రి అమ్మ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యే



విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారినీ తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. పిదప ఆలయ పర్యవేక్షణ అధికారి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీపీఐ నేత పిట్టా తోటయ్య మృతికి నివాళులు

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలసకు చెందిన సీపీఐ నేత పిట్టా తోటయ్య (70) మృతి చెందారు. తోటయ్య చిట్టివలస జూట్ మిల్లులో పనిచేస్తూ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొంటూ 1979లో పార్టీ సభ్యులుగా కొనసాగుతూ యూనియన్ కార్యకలాపాలలో చురుకైన పాత్ర పోషించారు. ఎర్రజెండా నీడలో చివరి వరకు కొనసాగిన వ్యక్తి తోటయ్యకు సీపీఐ నేతలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సీనియర్ నాయకులు చిల్ల నరసింహులు, సన్నీ బాబు, లక్ష్మణరావు, ఆదినారాయణ, అప్పారావు, ఆదిలక్ష్మి, ముత్యాలరావు, వీర్రాజు మృతుడు తోటయ్యకు అంతిమ వీడ్కోలులో ఎర్రజెండాలతో పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు ఎస్.అప్పలనాయుడు, చిట్టివలస జూట్ మిల్ పెన్షనర్ సంఘం దామోదర్, బాబాజీ, సింగిడి అప్పారావు, ప్రజా నాట్య మండలి సభ్యులు సత్యారావులు కూడా తోటయ్యకు ఘన నివాళులర్పించారు.

ఇండియన్ ఆర్మీకి గీతం విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థికి "ఇండియన్ ఆర్మీ"లో పనిచేసే అరుదైన అవకాశం లభించింది. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ద్వారా బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్స్ అప్లికేషన్స్ (బిసిఏ) విద్యను పూర్తిచేసుకున్న వినీల్ దీక్షిత్ ఈ ఘనతను సాధించాడు. విశ్వవిద్యాలయంలోని ఎన్.సి.సి నేవీ విభాగంలో కేడెట్‌గా ఎంపికయిన వినీల్ దీక్షిత్ క్రమశిక్షణ, అంకితభావం, కఠిన పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యం గల ఉత్తమ కేడిట్‌గా జాతీయ స్థాయిలో రిపబ్లిక్ డే పెరేడ్‌కు గతంలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించాడు. గీతం విద్యార్థి ప్రతిభను గుర్తిస్తూ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్.ఎస్.బి) ఈ ఏడాది ఎన్.సి.సి స్పెషల్ ఎంట్రీ కింద ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమిలో శిక్షణకు ఎంపిక చేసింది. శిక్షణ అనంతరం భారత రక్షణ దళాలలో ఆఫీసర్ కేడర్‌లో పని చేసే అవకాశం వినీల్ దీక్షిత్‌కు లభించనుంది. విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయడంలో గీతం ఎన్.సి.సి. విభాగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గతంలో సహితం పలువురు విద్యార్థులు ఎన్.సి.సి శిక్షణ ద్వారా భారత నౌకాదళంలోకి ఎంపికఅయ్యారు. కాగా వినీల్ దీక్షిత్ ప్రతిభను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్.సి.సి అధికారులు అభినందించారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కోన వెంకన్న కల్లాలు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మొదటి రోజు బుధవారం నిమజ్జనం చేశారు. అందులో భాగంగా 12 కేజీల లడ్డుకు వేలంపాట నిర్వహించగా కోన శంకర్ 12500 రూపాయలకు పాటు వేలంపాటలో లడ్డు దక్కించుకున్నారు. ఈ కార్య క్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో హాప్ ఆఫ్- హాప్ ఆన్ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద ప్రారంభించనున్నందున సంబంధిత ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఆర్కే బీచ్ వద్ద పరిశీలించి, అవసరమగు ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కార్యక్రమాల పై శుక్రవారం విశాఖ నగరానికి విచ్చేయనున్నారని, ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయం సమీపంలో విశాఖ నగరంలో ప్రధమంగా ప్రవేశపెడుతున్న హాప్ ఆఫ్- హాప్ ఆన్ డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభిం చనున్నారన్నారు. ఈ ప్రారంభోత్సవానికి అవసరమగు కార్యక్రమాలను కమిషనర్ పరిశీలిస్తూ స్టాళ్లను, టికెట్ కౌంటర్, పోడియం, పగోడా ,మైక్ సిస్టమ్, బ్యాక్ డ్రాప్, ఫ్లాగ్, క్యాప్స్, టీ షర్ట్స్‌లు, అలాగే బస్సు డ్రైవర్, గైడ్ లకు యూనిఫామ్ మొదలైనవి ఏర్పాటు చేయాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ పివివి సత్యనారాయణ రాజుకు, డిస్ట్రిక్ట్ టూరిజం అండ్ కల్చర్ ఆఫీసర్ మాధవికు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ అప్పలరాజుకు ఆదేశిస్తూ, వెంటనే ఏర్పాట్లు చేపట్టాలని ఏర్పాటులో ఎక్కడ ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని కమిషనర్ వారికి ఆదేశించారు. అనంతరం డబల్ డెక్కర్ బస్సులో ఇవ్వనున్న టిక్కెట్లను, టికెట్లకు సంబంధించి పి ఓ ఎస్ (పాయింట్ ఆఫ్ సేల్)మిషన్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారులు కృష్ణంరాజు, బి.ప్రసాద్ రావు, కార్యనిర్వాహక ఇంజనీర్ నర్సింగరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురువారం హోటల్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సేనాతో సేనాని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లతో పాటు ప్రజలకు చెప్పాల్సిన ఉద్దేశాన్ని నాయకులకు వివరించారు.

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం

త్రైసేవల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ యాత్రను ప్రారంభించిన వైస్ అడ్మిరల్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : త్రై-సేవల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్రను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, తూర్పు నావికాదళం, విశాఖపట్నంలోని నావికాదళం నుండి ప్రారంభించారు. సహ్యాద్రి శ్రేణుల పేరు పెట్టబడిన భారత నావికాదళ నౌక సహ్యాద్రి ముఖ్యమైన బౌద్ధ చారిత్రక ప్రదేశాలకు నిలయంగా ఉంది . టీమ్ స్టిక్ ఫ్రేమ్‌వర్క్ , భారత హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భావించబడిన బైకింగ్ యాత్రకు తగిన నేపథ్యాన్ని ఏర్పరచింది. ఈ యాత్ర నేపాల్, భారతదేశం, శ్రీలంక అంతటా శాంతి, కరుణ , సోదరభావంపై లార్డ్ బుద్ధుని సందేశాలను వ్యాప్తి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రజల అవసరాలు తీర్చడమే చంద్రబాబు ధ్యేయం

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్రంలో వినాయక చవితి, దుర్గా నవరాత్రులు సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసుకొనే మండపాలకు అనుమతులు సులువుతరం చేయడం, మండపాల కోసం ఉపయోగించే విద్యుత్ కూడా ఉచితంగా ఇవ్వడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనాదక్షతకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి సర్కార్ అద్భుతమైన నిర్ణయం తీసుకుందని అన్నారు. గతంలో మండపాలకు అనుమతులు కోసం దరఖాస్తులు పట్టుకొని ఆయా కార్యాలయాలకు తిరిగేవారని, విద్యుత్ సప్లయ్ కోసం వేల రూపాయలు డిడిలు కట్టేవారని అన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో విద్యుత్ ఉచితంగా ఇవ్వడం శుభపరిణామమని అన్నారు.

వినాయకుడికి విశేషపూజలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా 75వ వార్డు కార్పొరేటర్, మాజీ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి రమణారెడ్డి నగరంలోని పలు గణపతి మందిరాలను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. తొలుత సీతానగరం మర్రి చెట్టు దగ్గిర కొబ్బరి కాయకొట్టి పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధిలు సాదర స్వాగతం పలికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పల్లెవీధి, రజక వీధి, నెల్లిముక్కు రామాలయం, ధర్మాల వీధి, దుర్గవాని పాలెం శివాలయం, ముసలనాయుడు పాలెం, కొత్త అయ్యన్నపాలెం, పాత అయ్యన్నపాలెం, పెదగంట్యాడ గొడ్డివాణిపాలెం, చినకొరడా ఎస్ సి కాలనీ, తదితర ప్రాంతాల్లో గణపతి మందిరాలను సందర్శించి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాబు జగజీవన్ రామ్ కాలనీలో వినాయక ఉత్సవ్ 2025 పేరుతో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్య క్రమాలకు ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని పూజలు జరిపారు. యువత ముందుకు వచ్చి వినాయక చవితి మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటారావు, పైడి రాజు, రాము, అశోక్, రాజేష్, భోగి రాజు, హేమంత్, క్రాంతి, మహేష్, రాజు, అర్జున్ కాలనీ యువకులు, మహిళలు, తది తరులు పాల్గొన్నారు.

29న గీతం వేదికగా రాష్ట్రస్థాయి "ఫిన్‌టెక్ ఒలింపియాడ్"

విశాలాంధ్ర - మధురవాడ: ఫిన్‌టెక్ రంగంలో యువ ప్రతిభను ప్రోత్సహించడానికి ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఆగస్టు 29న రాష్ట్రస్థాయి ఫిన్‌టెక్ ఒలింపియాడ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఫిన్‌టెక్ ఫోరమ్ సి.ఇ.ఓ నిపాదత్తా తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచ్యువల్ ఫండ్స్ ఇండియా (ఎ.ఎమ్.ఎఫ్.ఐ), జిరోదా, క్యాష్‌రిచ్, యు.టి.ఐ. మ్యూచ్యువల్ ఫండ్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఒలింపియాడ్‌లో భాగంగా దేశ ఆర్థికరంగంపైన, ఆర్థిక అక్షరాశ్యతపైన, పెట్టుబడులకు, సంబంధించిన ఆర్థిక అంశాలపైన నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఒలింపియాడ్‌లో పాల్గొనున్నారని వెల్లడించారు. ఫిన్‌టెక్ పరిజ్ఞానంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని, సర్టిఫికెట్‌లు, నగదు బహుమతి అందజేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ముగ్గురు విజేతలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ఫిన్‌టెక్ ఒలింపియాడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.

నేడు విశాఖలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు

ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేష్ హాజరు
శాప్ ఛైర్మన్ రవినాయుడు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ వేదికగా ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ విశాఖలోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరగనున్న "నేషనల్ స్పోర్ట్స్ డే" సెలబ్రేషన్స్‌కు విచ్చేస్తున్న సందర్భంగా శాప్ ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో కలిసి ఏయూ కన్వెన్షన్ సెంటర్లో కార్యక్రమ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో శాప్ ఛైర్మన్ మాట్లాడారు. గతానికి భిన్నంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నామన్నారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్ వేదికగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులను సన్మానిస్తున్నామన్నారు. వేడుకలకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని, రాష్ట్రంలోని అంతర్జాతీయ క్రీడాకారులు, నేషనల్, ఖేలో ఇండియా, ఏషియన్ పోటీల విజేతలందరూ హాజరవుతున్నారని వివరించారు. శాప్ చరిత్రలో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా తొలిసారి అమరావతి ఛాంపియన్షిప్ పేరుతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించామన్నారు. 480 మంది క్రీడాకారులను రేపు ఘనంగా సత్కరించబోతు న్నామన్నారు. ఆగస్టు నెలను స్పోర్ట్స్ నెలగా చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 24,700 మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేశామని, వచ్చే ఏడాది నిర్వహించే నేషనల్ స్పోర్ట్స్ డేలో లక్ష మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు పీబీవీఎస్ఎన్.బుచ్చిరాజు, ఎస్.సంతోష్ కుమార్, శాప్ ఏవో వెంకటరమణ నాయక్, టీఎస్ఓ రమణమ్మ, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, డీఎస్డీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2 నుండి వార్షిక పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 2 నుండి 6వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవములు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు తెలిపారు.

శ్రీ స్వామి వారి ఉత్సవమూర్తులైన శ్రీ గోవింద రాజ స్వామి వారు, అమ్మవార్లను కళ్యాణ మండపం నందు వేం చేయింప చేసి విశేష ఉత్సవము జరుగుతుందన్నారు. సదరు పవిత్రోత్సవాలలో విశేష హోమములు, వేదపారాయణలు, దివ్య ప్రబంధ సేవకాలము, తిరువీధి ఉత్సవములు జరుగనున్నాయి. తేదీ.02 న సాయంత్రం గం. 6.00 ల తరువాత విశ్వక్సేణారాధనం, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరణం, ఉత్సవాంగీకారం, మృత్యం గ్రహణము, అంకురార్పణ మొదలగు కార్యక్రమాలు, తేదీ.03వ తేదీ ఉదయం గం. 7.00 లకు శాంతి పాఠం, పవిత్రాదివాసం, యాగాశాలార్చనం, కుంభా వాహనం, ప్రవిత్రాది వాసం, చక్రాబ్జమండలరచనం, ఆవాహనం, ఆరాధనం, పవిత్రప్రతిష్ట, సాయంత్రం గం..5:00లకు గ్రామ తిరువీధి. తేది 04న విశేష ఆరాధనం, హోమములు, విశేష పారాయణలు, సాయంత్రం గం..5:00లకు గ్రామ తిరువీధి. రాత్రి పవిత్ర సమర్పణ. తేదీ.05న ఉదయం విశేష ఆరాధనం, హోమములు, విశేష పారాయణలు, రాత్రి, ఆరాధనానంతరం విశేష్ హోమములు, పూర్ణా హుంతి, ఉత్తర శాంతి, మంగళా శాసనం, పవిత్ర విసర్జనం, తీర్ధ గోష్టి, రథబలి, గ్రామ తిరువీధి (ఆరాధనం అనంతరం) పవళింపు కవాట బంధనం. తేదీ.06 న ఉదయం - ఆరాధనంలో ఏకాంతస్నపన తిరుమంజనం సాయంత్రం గం..5:00లకు గ్రామ తిరువీధి తేదీ.02.09.2025 నుండి తేదీ.06.09.2025 ఆఖరు వరకు శ్రీస్వామివారి పవిత్రోత్సవములు జరుగుతాయన్నారు.

నగర మేయర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారి సాహిత్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కె.చిరంజీవి నాగ వెంకట సాహిత్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా 2024 బ్యాచ్ కి చెందిన ప్రొబేషనర్ అధికారి జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలపై ట్రైనీ ఐఏఎస్ అధికారిగా ఆగస్టు 18 వ తేదీ నుండి 23వ తేదీ వరకు నగరంలోని పలు ప్రాజెక్టులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ నగర మేయర్ ను కలిసి విశాఖ నగర లో చేపడుతున్న పలు అభివృద్ధి ప్రాజెక్టు లైన ఇంజనీరింగ్ పట్టణ ప్రణాళిక విభాగం రెవెన్యూ యు సి డి మొదలైన విభాగాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు సమీక్షించడంతోపాటు ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని మేయర్ కు వివరించారు. అనంతరం నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలు ఎంతో సౌమ్యం కలిగిన వారిని ఇక్కడ పనిచేసే అధికారికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అలాగే ఇంకా మురికివాడలు, పాత నగరం, జీవీఎంసీ కొత్తగా చేపడుతున్న ప్రాజెక్టులు మొదలైనవి కూడా పరిశీలించాలని మేయర్ ట్రైనీ కలెక్టర్ కు సూచించారు.

డబ్బులు అడ్వాన్స్ తీసుకొని ఇంటిని మరొకరికి అమ్మేసారు...

టీడీపీ నాయకుడు వేగి గోవింద్ ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి: ఇంటిని అమ్మకం పెట్టి 15 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్న రాధ, శివ, కసిరెడ్డి సత్యన్నారాయణ అనే వ్యక్తులు ఇపుడు మాటమార్చి తప్పుడుగా వ్యవహరిస్తున్నారని పెందుర్తి మండలం, జీవిఎంసీ 96వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు వేగి గోవింద్ ఆవేదన వెలిబుచ్చారు. గురువారం పెందుర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాధ, శివ, కసిరెడ్డి సత్యన్నారాయణలు ప్రకాశ్ నగర్ లో గల వారి ఇంటిని అమ్మతానని 2023లో తన వద్దకు వచ్చారని తెలిపారు. ఆర్థిక అవసరాలు కోసం ఇంటిని అమ్ముతున్నామని, మీ ఇంటికి సమీపంలో ఉన్నందున మీరు తీసుకోవాలని నన్ను కోరినట్లు తెలియచేసారు. దీంతో అదే సంవత్సరంలో 15 లక్షలు అడ్వాన్సుగా చెల్లించి ఆ ఇంటి కొనుగోలుకు అగ్రిమెంట్ రాయించుకున్నానని తెలిపారు. దీనికి సంభందించిన డాకుమెంటును మీడియాకు చూపించారు. అయితే ఆ తర్వాత అదనంగా డబ్బు వస్తోందనే ఆశతో మాటమార్చి మరొకరికి అమ్మడానికి సిద్ధపడగా, తనకు సమాచారం తెలియడంతో కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకున్నానని తెలియచేసారు. ఈ నేపద్యంలో శివ, రాధ, సత్యన్నారాయణలు మీడియా సమావేశం నిర్వహించి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. డబ్బు ఆశతోనే తనపై ఆరోపణలు చేస్తున్నారు తప్ప వారు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని వెల్లడించారు. దీనికి సంభందించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని మీడియాకు వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆ ఇంటిని వదలబోనని స్పష్టం చేసారు.

సజావుగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్టీల్ ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం స్కూల్ యందు డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కె జి బి సెక్రటరీ అయిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ మధుసూదన్ మరియు ఆర్జెడి విజయ భాస్కర్, డీఈవో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. డీఎస్సీ లో సెలెక్ట్ అయిన 1416 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ గాను ఈ జుకు 815 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ అవనున్నది. ఈ సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కొరకు 17 రూమ్స్ లో 17 లాప్టాప్ లు మరియు ఒక హెచ్‌ఎం, ఎంఈఓ, రెవెన్యూ ఆర్ ఐ మరియు ఒక దేటా ఆపరేటర్ ఒక రూమ్ కి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో హెచ్ఎం కు మరియు ఎంఈఓ కు ఓటిపి వెరిఫికేషన్ జరుగుతుంది. డీఈవో గారు ఇచ్చిన సమాచారం మేరకు ఎంత సమయమైనా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కంప్లీట్ చేస్తామని అన్నారు.

దేశవ్యాప్తంగా ఫ్లిప్‌కార్ట్ కార్యకలాపాలు విస్తరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, ఈరోజు దాని ప్రధాన వండుగ కార్యక్రమం ది బిగ్ బిలియన్ డేస్‌కు ముందు భారతదేశ వ్యాప్తంగా సరఫరా చైన్ మౌలిక సదుపాయాల యొక్క ప్రధాన విస్తరణ కార్యక్రమంను గురించి వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ (వారణాసి, ఆగ్రా, ఘజియాబాద్), బీహార్ (పాట్నా), హర్యానా (మనేసర్), త్రిపుర (అగర్తల) వంటి కీలక రాష్ట్రాలలో కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు (ఎఫ్ సి లు) , తుది మైలు హబ్‌లను జోడించడంతో, ఫ్లిప్‌కార్ట్ తమ ప్రాంతీయ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్నట్టు ఫ్లిప్కార్ట్ సరఫరా చైన్ విభాగ హెడ్ హేమంత్ బద్రి తెలిపారు. ఈ సంవత్సరం విస్తరణ 35 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని, దేశవ్యాప్తంగా 21,000 కి పైగా పిన్‌కోడ్‌లను కవర్ చేస్తుందన్నారు.

నివా బుపా 'రీఅష్యూర్ 3.0'తో అపరిమిత బీమా కవర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ తన తాజా ఫ్లాగ్‌షిప్ ప్రొడక్ట్ రిఅష్యూర్ 3.0ను ప్రారంభిం చింది. ఇప్పటి వరకు ఆరోగ్య బీమా ఉత్పత్తులను రూపొందించిన విధానాన్ని మార్చిపెట్టే ఈ విప్లవాత్మక ఆవిష్కరణలో మొదటిసారిగా అన్ లిమిటెడ్ బేస్ సమ్ ఇన్స్యూర్డ్ అందిస్తోంది. ఇప్పటివరకు ఉన్న నో క్లెయిమ్ బోనస్, ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, రిస్టోరేషన్/రీ-ఇన్‌స్టేట్‌మెంట్, అనుపయోగమైన సమ్ ఇన్స్యూర్డ్‌ను క్యారీ ఫార్వర్డ్ చేసుకోవడం, టాప్-అప్ ప్లాన్లు వంటి అన్ని పద్ధతులను ఇవి అమాన్యంగా మార్చేస్తున్నాయి. ఇదే సమయంలో, కేవలం రక్షణ మాత్రమే కాకుండా వెల్‌నెస్ ఆఫరింగ్‌లతో కూడిన ఆరోగ్య బీమా ఉత్పత్తుల కొత్త యుగానికి నాంది పలుకుతోంది. సాంప్రదాయ ఆరోగ్య బీమా ఉత్పత్తుల్లో కస్టమర్లు తమ సమ్ ఇన్స్యూర్డ్ సరిపోతుందా అనే ఆందోళనలో ఉంటారు. నివా బుపా రిఅష్యూర్ 3.0 ఆ సమస్యను శాశ్వతంగా తొలగిస్తుంది.

అభిలాష్ కనస్ట్రక్షన్స్ యక్ష ప్రైడ్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: రియల్ ఎస్టేట్ రంగంలో గత 38 సంవత్సరాలుగా విశేష అనుభవం కలిగిన విశ్వసనీయమైన నిర్మాణ సంస్థ అభిలాష్ కనస్ట్రక్షన్స్ తమ మరో ప్రతిష్టాత్మ కమైన ల్యాండ్ మార్క్ గేటెడ్ కమ్యూనిటీ " యక్ష ప్రైడ్ " ను విశాఖపట్నంలోని ఆనందపురం జాతీయ రహదారికి సమీపంలో ఈరోజు ఆవిష్కరించారు. ఈ కేటెడ్ కమ్యూనిటీ నందు మొత్తం 40 ప్రత్యేకత కలిగిన లగ్జరీ విల్లాలు మరియు 264 ప్రీమియం అపార్టుమెంట్లు ఉంటాయి. అత్యంత ప్రతిష్టాత్మకమైన యక్ష ప్రైడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో విశాఖపట్నం లోక్ సభ సభ్యులు శ్రీ భరత్ మతుకుమిల్లి పాల్గొన్నారు. అభిలాష్ కనస్ట్రక్షన్స్ వారు చేపట్టిన యక్ష ప్రైడ్ ప్రాజెక్టు విజన్ ను వారు ప్రశంసించారు. అభిలాష్ కనస్ట్రక్షన్స్ యక్ష ప్రైడ్ ఆవిష్కరణ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరక్టర్ అభిలాష్ మరియు డైరక్టర్ దివ్య అభిలాష్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రపంచ స్థాయి ఆర్కిటెక్చర్ తోటి అధునిక జీవన సరళికి అనుగుణంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఏషియన్ ఫుట్‌వేర్స్ భారీ విస్తరణ ప్రణాళిక

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారత్‌లో వేగంగా ఎదుగుతున్న ఫుట్‌వేర్ బ్రాండ్లలో ఒకటైన ఏషియన్ ఫుట్‌వేర్స్ తన బ్రాండ్ అంబాసడర్ క్రికెటర్ ఎంఎస్ ధోనీ చేతుల మీదుగా సిగ్నేచర్ రేంజ్ 'క్వాంటమ్ 2.0' పేరుతో కొత్త ప్రీమియం షూస్ కలెక్షన్‌ను విడుదల చేసింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో భారీ విస్తరణ ప్రణాళికలను కూడా ప్రకటించింది. ప్రస్తుతం 3,000 రిటైల్ ఔట్‌లెట్ల నుంచి 8,000 దుకాణాలకు విస్తరించనుంది. ప్రత్యేక బ్రాండ్ ఔట్‌లెట్ల సంఖ్యను కూడా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విస్తరణ 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి చేయనుంది. ఈ కొత్త ప్రీమియం షూస్ కలెక్షన్‌లో హైపర్ కుషన్, పవర్ కిక్, మోజో మోడల్స్ ఉన్నాయి. ఇవి అత్యాధునిక, బిఐఎస్ సర్టిఫైడ్ డిజైన్, టెస్టింగ్ ల్యాబ్‌లో ఇన్-హౌస్ డిజైన్ చేయబడ్డాయి. స్టైల్, పని తీరును సమపాళ్లలో ప్రతిబింబించే ఈ మోడల్స్ గ్లోబల్ లుక్ కోరుకునే వినియోగదారులకు అందుబాటు ధరలో ఉండనున్నాయి. ఏషియన్ ఫుట్వేర్ దేశవ్యాప్తంగా తన కార్యకలాపాల విస్తరణ కోసం రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కూడా ప్రకటించింది.

ఘనంగా సాంసంగ్ కిడ్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సాంసంగ్ ఈరోజు 'శామ్‌సంగ్ కిడ్స్ డే ఎట్ ది రేట్ శామ్‌సంగ్ - 2025' ను నిర్వహించింది. ఉద్యోగులు, వారి పిల్లలు, జీవిత భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ ప్రత్యేక వేడుక, శామ్‌సంగ్ కుటుంబంలో భాగమైనందుకు వారు గర్వంగా ఫీలయ్యేలా చేసిందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. గురుగ్రామ్‌లోని శామ్‌సంగ్ కార్పొరేట్ కార్యాలయంలో ఈ రోజంతా నిర్వహించబడిన కార్యక్రమం, కుటుంబాలకు చిరస్థాయిగా నిలిచే జ్ఞాపకాలను అందించడమే కాక, తదుపరి తరాన్ని కలలు కనడానికి, ఆవిష్కరించడానికి, సాంకేతికతను అన్వేషించడానికి స్ఫూర్తినిచ్చేలా రూపుదిద్దుకుందన్నారు. శామ్‌సంగ్ కుటుంబాన్ని సెలబ్రేట్ చేసుకోవడం ఈ చొరవ ద్వారా పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి శామ్‌సంగ్ ప్రపంచంలోకి అడుగుపెట్టి, వారు పనిచేస్తున్న వాతావరణాన్ని దగ్గరగా చూశారని, కంపెనీ ఆవిష్కరణ మరియు సంరక్షణ సంస్కృతిని అనుభవించే ఈ అవకాశంలో జీవిత భాగస్వాములు కూడా పాల్గొనడం వల్ల, ఈ వేడుక విస్తృత కుటుంబాలు కలిసి ఉండటానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ ఏడాది వేడుక మా సన్నిహిత శామ్‌సంగ్ కుటుంబ బంధాలను బలోపేతం చేయడమే కాక, తదుపరి తరాన్ని సృష్టికర్తలు, ఆలోచనా పరులు, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడానికి మేము చేస్తున్న నిరంతర కృషికి ప్రతిబింబంగా నిలిచింది సాంసంగ్ ఇండియా పీపుల్ టీం హెడ్ రిషబ్ నాగ్‌పాల్ అన్నారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి 3
శుక్రవారం 29, ఆగస్టు 2025

నేటి రాజకీయాలపై ఇప్పటికీ ద్రావిడ ఉద్యమ ప్రభావం

ఆచార్య కెయస్.చలం పెరియార్ వందేళ్ళ ద్రవిడ ఉద్యమం పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారతం రాజకియాల్లో నేటికీ అరుదైన ద్రావిడ ఉద్యమం ప్రభావం ఉందని, వెనుకబడిన వర్గాల నాయకుడు పెరియార్ ఈ.వి.రామస్వామి ఉద్యమ పభావం కనిపిస్తుందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు ఆచార్య కె యస్. అభిప్రాయపడ్డారు. ఆయనపై విశేష పరిశోధన చేసిన ఎస్ వి.రాజదొరై కూడా విస్తృతమైన సామాజిక నేపథ్యం ఉన్నవాడని అన్నారు. ఒక సాధారణ ఉద్యోగి గా ప్రారంభమై మావోయిస్టుగా, సివిల్ లిబర్టీస్ నాయకునిగా ఉంటూ పెరియార్ పై గ్రంధాలు రాసి, ఉద్యమాల్లో ఉన్న బ్రాహ్మణీయ వాతావరణానికి దూరంగా జరిగి 85 ఏళ్ల వయసులో విశ్రాంతి తీసుకుంటూ కూడా అరుదైన పెరియార్ వందేళ్ళ ద్రవిడ ఉద్యమం పుస్తకం ప్రచురించారని అన్నారు. ఇది సాధారణ పుస్తకం కాదు. ఆయన రచనలు తమిళనాడు రాజకీయాల్లో దేశ పరిస్థితులను వివరించే క్రమంలో రాజాదురై మిత్రుడు కు మిత్రుడైన విద్యా భూషణ్ రావత్ (ఢిల్లీ)తో జరిపిన సంభాషణల రూపం అన్నారు .400 పేజీల పెరియార్ లికాస్ట్ ,నేషన్, అండ్ సోషలిజంలి అన్న గ్రంథాన్ని చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆచార్య కె యస్.చలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా వందేళ్ళ క్రితం జూలై 1925లో పెరియార్ వైకోం సత్యాగ్రహాన్ని, అంటరాని వారి ఆలయ ప్రవేశం కోసం ప్రారంభించిన నేపథ్యాన్ని వివరించారు. సభలో పుస్తకంలోని విశేషాలను చలం విశిదీకరించారు. ఈ పుస్తకం ప్రశ్న ,సమాధానం పద్ధతిలో జరిగిన తీరు, తద్వారా మామూలు పుస్తకాల్లో వివరించలేని అనేక విషయాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా రచయిత నేపథ్యం కృషి రచన పై వాటి ప్రభావం చెప్పడానికి వీలు పడుతుందని, ఇందులో దక్షిణమే కాదు ఉత్తరాది వెనుకబడిన తరగతుల ఉద్యమానికి సోషలిస్టులు రాజనారాయణ వంటి వారి సమావేశాలను లక్నో, పాట్నా ,ఢిల్లీ నగరాల్లో పర్యటించిన వివరాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పెరియార్ అంబేద్కర్ లా మిత్రృత్వం, ఇరువురు కలిసి పాల్గొన్న సమావేశాలు, బౌద్ధ సమావేశాలకు కలిసి వెళ్లిన వివరాలు ఉన్నాయి. ముఖ్యంగా బొంబాయి ఉత్తరాది రాష్ట్రాల్లో పెరియార్ పర్యటించిన చాలా సభలు అంబేద్కర్ అనుయాయులు ,కార్యకర్తలు ఏర్పాటు చేసినవే ఉన్నాయి. అయినా కొంతమంది కావాలని పెరియార్ పై బుద్ధ జల్లిన విశేషాలు రాజదురై పేర్కొన్నారు. పెరియర్ను సమర్ధించి వివరించిన వివరాలు ఉన్నాయి. పెరియార్ ద్రావిడ ఉద్యమ నిర్మాతే కాదు సోషలిజం కోరుకున్న గొప్ప నాయకుడు.రష్యాలోనూ పర్యటించాడు. ఆయనతోపాటు పనిచేసిన సింగరవేలు కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ఒకరు. అంటే పెరియార్ సమగ్ర ఉద్యమ స్వరూపం తెలుసుకోవాలంటే ఈ గ్రంథం చదవాలన్నారు . చలం మాట్లాడుతూ ద్రావిడ ఉద్యమంలో వచ్చిన వైరుధ్యాలను బహిర్గతంగా ఎదురౌతున్న సవాళ్లను వివరించారు. ముఖ్యంగా దక్షిణాదిలో దళితులపై జరుగుతున్న దాడులకు కారణం భూ సంస్కరణలు జరగకపోవడమే అని పేర్కొన్నారు .ముఖ్యంగా దాడులకు గురవుతున్న దళితులంతా భూమిలేని గ్రామీణ పేదలే అన్నారు. దళిత పెరియార్ ద్రావిడ ఉద్యమాలు సోషలిస్టు కమ్యూనిస్టు ఉద్యమాలు దీనిపై దృష్టి పెట్టవలసిన ఆవశ్యకత, ద్రావిడ ఉద్యమాన్ని దేశానికి అంతటికి విస్తరించవలసిన అవసరం వుందిని చెప్పారు. దేశంలో త్రైవర్ణీకులు కాని వారు ఎన్నో డిఎన్ఎ పరిశోధనల ప్రకారం ద్రావిడులే, కాబట్టి నేటి పరిస్థితుల దృష్ట్యా ఉద్యమ విస్తరణకై కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఇప్పుడు తమిళనాడులో పెరియార్ ను యువకులు బాగా ఎక్కువ చదువుతున్నారని, భవిష్యత్తులో ఇంకా పెరుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కొలతూర్ మణి, విద్యా భూషణ్ రావత్, ఎస్వి రాజదురై, డాక్టర్ కులీకనగా వినాయగం, ఏఎస్ పన్నీర్ సెల్వం, డాక్టర్ కార్తీక్ రామ్ మనోహపారన్ తదితరులు ప్రసంగించారు.

ఆడారి ఆనంద్ అవినీతికి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అండ

కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్ మురారి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ డైరీని కుటుంబ సంస్థగా మార్చేసుకొని ఆడారి ఆనంద్ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్ మురారి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆయన అవినీతి కప్పి పుచ్చుకోవడానికి అధికార పార్టీలో చేరుతుంటారని, టీడీపీ నుండి వైసీపీ లోకి, ఇప్పుడు బీజేపీలోకి వెళ్లారని, అతని పై కూటమి ప్రభుత్వం శాసనసభ స్పీకర్ అయ్యన పాత్రుడు, శాసనసభ్యులు జోతుల నెహ్రూ నాయకత్వంలో హౌస్ కమిటీ వేసి విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు . ఇంతలోనే ఆశ్చర్యంగా ఆడారి ఆనంద్ బీజేపీ లో చేరడం, చేరిన వెంటనే రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం చకచక జరిగిపోయాయని, ఇప్పుడు ఆడారి ఆనంద్ అవినీతి పై హౌస్ కమిటీ విచారణ ముందుకు వెళ్లకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కాపాడతారా? ఆ వ్యూహంలో భాగంగానే ఆడారి ఆనంద్ ని రక్షించేలాగ పీవీన్ మాధవ్ ఆడారి ఆనంద్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడిని చేసారా అనే అనుమానం కలుగుతుందన్నారు .పార్టీలో ఎంతోమంది సీనియర్లు ఉండగా ఆడారి ఆనంద్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడిని ఎలా చేసారని,విశాఖ డైరీ గిట్టుబాటు ధర కలిపించకుండ మావద్ద పాలు సేకరిస్తున్నారని, డైరీ రైతులు విశాఖ డైరీ వద్ద ధర్నా చేసిన విషయం పీవీన్ మాధవ్ కి తెలీదా అని ఆయన ప్రశించారు. సామాన్యులను దోచుకొనే కార్పొరేట్లకు బీజేపీ కొమ్ము కాస్తుందని మళ్లీ ఈ విషయంలో రుజువైందన్నారు., బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ ఈ నియామకం ద్వారా ఏదైన లబ్ది పొందారా అనే అనుమానాలు వస్తున్నాయని జగన్ మురారి అన్నారు. మాధవే స్వయంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి పాడి రైతులకు న్యాయం చేయాలని జగన్ మురారి డిమాండ్ చేసారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40,60,62వ వార్డులో సీఎం రిలీఫ్ ఫండ్ (ముఖ్యమంత్రి) సహాయనిధి ద్వారా ఉన్న కుటుంబాలకు గురువారం వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు చేతుల మీదుగా 1,06,334, 30,967, 50,250, 25,000, 37,378,చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ 60.వ.వార్డు ప్రెసిడెంట్ మాత శ్రీను, ప్రధానకార్యదర్శి కొమ్మోజు కుమార్, మరియు నాయకులు కార్యకర్తలు మహిళలు మరియు శ్రేయోభిలాసలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్:విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని విశాఖ జిల్లా ఇంఛార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..... ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖకు డేటా సెంటర్ తలమానికంగా మారుతుందన్నారు. డేటా సెంటర్ ఏర్పాటుతో ఉత్తరాంధ్రలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో విశాఖను భూ కబ్జాలు, అరాచకాలు, అక్రమాలు, గంజాయితో విధ్వంసం చేస్తే కూటమి ప్రభుత్వం కంపెనీలను తీసుకొచ్చి ఐటి హబ్ గా మార్చుతుందన్నారు. డేటా సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఐటీ మంత్రి నారా లోకేష్ కి విశాఖ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ నిరసనలు

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సును ప్రవేశపెట్టడం వలన ఆటో కార్మికులు రోడ్డున పడ్డారంటూ గురువారం నాడు వేములవలస కూడలిలో శ్రీలక్ష్మి పైడితల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల ఆటో యూనియన్ అధ్యక్షులు పతివాడ నర్సింగ్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులపై కక్ష పూర్తి రాజకీయాల వలన వేల కుటుంబాలు రాష్ట్రంలో రోడ్డును పద్దాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు సంవత్సరానికి 15000 రూపాయలు ఇస్తానన్నామీను నెరవేర్చాలని. నెలకు 25 వేల రూపాయలు జీతాలు కింద ఆటో కార్మికులకు ఇచ్చి ఆటోలను ఉచిత సర్వీస్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని ట్రాఫిక్ పోలీసులు అధిక చలానాలతో ఆటో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని నియంత్రణ చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల ఆటో కార్మికులు వేముల స్కూడలలో శాంతియుత ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పతివాడ. నర్సింగరావు, కొండ్రోతు రామారావు, కోరాడ గోపి,కెల్లా శ్రీను, రౌతు గోపి తదితరులు పాల్గొన్నారు.